క్లుప్తంగా

వరద బాధితులకు రూ.లక్ష సాయం



ముఖ్యమంత్రి సహాయ నిధికి చెక్కు అందజేస్తున్న భమిడిపాటి కల్యాణి

సీతంపేట : విజయవాడలో సంభవించిన వరదలు కారణంగా నష్టపోయిన వారికి సాయంగా జీవీఎంసీ 26వ వార్డు అక్కయ్యపాలెంకు చెందిన భమిడిపాటి కల్యాణి రూ.లక్ష చెక్కును విరాళంగా ముఖ్యమంత్రి సహాయ నిధికి అందజేశారు. సంబంధిత చెక్కును టీడీపీ వార్డు అధ్యక్షుడు ముక్కా కిషోర్ కుమార్‌కు గురువారం అందజేయగా... ఆయన బ్యాంకులో డిపాజిట్ చేశారు. ఈ సందర్భంగా ఆమెకు అభినందనలు తెలుపుతూ ప్రతి ఒక్కరూ ఉన్నంతలో సహాయం అందించాలని కోరారు.

యువతి అదృశ్యం



మోటూరి లిఖిత

మద్రిపాలెం : కంచరపాలెం ఐదో పట్టణ పోలీస్ స్టేషన్ పరిధిలో ఓ యువతి అదృశ్యమైంది. కంచరపాలెం పరిధి ఇందిరానగర్ – 4లో తల్లిదండ్రులతో కలిసి మోటూరి లిఖిత (22) నివసిస్తోంది. ఈమె ఊర్వశి జంక్షన్ వద్ద ఉన్న డీమార్ట్‌లో గత ఎనిమిది నెలల నుంచి పనిచేస్తుంది. ఈ నెల 3న రాత్రి 8 గంటల ప్రాంతంలో ఇంట్లో నుంచి వెళ్లిపోయి... ఇంతవరకు తిరిగి రాలేదు. అంతటా వెతికినా ఫలితం లేకపోవడంతో ఆమె తండ్రి మోటూరి లక్ష్మీనారాయణ గురువారం ఐదో పట్టణ పోలీసులకు ఫిర్యాదు చేశారు. సీఐ ఎస్.భాస్కరరావు నేతృత్వంలో హెడ్ కానిస్టేబుల్ వీవీ రమణ కేసు దర్యాప్తు చేస్తున్నారు. ఆమె ఆచూకీ తెలిసిన వారు కంచరపాలెం పోలీసులకు సమాచారం అందించాలని కోరారు.

మట్టి ప్రతిమలతో పర్యావరణ పరిరక్షణ



మట్టి ప్రతిమలు పంపిణీ చేస్తున్న ప్రతినిధులు

సీతమ్మధార : గణపతి మట్టి ప్రతిమలను పూజించడం ద్వారానే పర్యావరణ పరిరక్షణ సాధ్యపడుతుందని సత్వ నేచురల్స్ సంస్థ ప్రతినిధి వి.మధుసూదన్‌రెడ్డి పేర్కొన్నారు. సీతమ్మధారలోని ఎంఎంటీసీ కాలనీ వద్ద గల సంస్థ దుకాణం ఆవరణలో గురువారం భక్తులకు వినాయక మట్టి ప్రతిమలు, వ్రతకల్పం పుస్తకాలు, మొక్కలు ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్వాతి ప్రమోటర్స్ సహకారంతో విగ్రహాలు, తమ సంస్థ తరపున మొక్కలు పంపిణీ చేపట్టామని తెలిపారు. స్వాతి ప్రమోటర్స్ జనరల్ మేనేజర్ లక్ష్మణరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

భక్తిమాల పుస్తకావిష్కరణ



పుస్తకం ఆవిష్కరిస్తున్న స్వరాజ్యం వెంకట రమణమ్మ తదితరులు

సీతంపేట : రచయిత నారాయణం వరలక్ష్మి రచించిన భక్తిమాల పుస్తకావిష్కరణ సభ గురువారం ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో నిర్వహించారు. సర్వేజన సుఖినోభవంతు సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో బాలబాట మాస పత్రిక సంపాదకులు స్వరాజ్యం వెంకట రమణమ్మ ముఖ్య అతిథిగా హాజరై పుస్తకాన్ని ఆవిష్కరించారు. రచయిత వరలక్ష్మి భక్తి సాహిత్యం, భక్తి గీతమాలిక రచన పుస్తక విశిష్టత వివరించారు. విజయ మ్యూజిక్ స్కూల్ వ్యవస్థాపకురాలు ఎం.విజయలక్ష్మి శివ కేశవుల గురించి వివరించారు. అనంతరం భక్తి మాల పుస్తకంలోని పాటలను సత్యమాధవి స్వరకల్పనలో సర్వేజన సుఖినోభవంతు సభ్యులు ఆలపించారు.

సమాజ నిర్దేశకులు ఉపాధ్యాయులు



సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పిస్తున్న చిన్నారులు



మురళీనగర్‌లో సత్కరించిన ఉపాధ్యాయులతో మహిళా వాకర్స్ క్లబ్ సభ్యులు, తదితరులు



కలెక్టర్ హరేందిర ప్రసాద్ చేతుల మీదుగా పురస్కారాన్ని అందుకుంటున్న విశ్వనాథం

సీతంపేట : ఆధునిక సమాజానికి దశ, దిశా నిర్దేశకులు ఉపాధ్యాయులేనని మాధవధార మహిళా వాకర్స్ క్లబ్ అధ్యక్షురాలు సత్తి లలితారెడ్డి అన్నారు. ఉపాధ్యాయ దినోత్సవం సందర్భంగా మురళీనగర్ బాలభాను విద్యాలయంలో నిస్వార్థంగా సేవలందిస్తున్న ఉపాధ్యాయులను ఉత్తమ ఉపాధ్యాయ ప్రతిభా పురస్కారాలతో సత్కరించారు. బాలభాను ప్రిన్సిపాల్ శుభశ్రీ, వైస్ ప్రిన్సిపాల్ టి.మనోరమణి, టీచర్స్ మేడూరి లక్ష్మి, చింతలపాటి ప్రవీణ, వ్యాయామ ఉపాధ్యాయుడు సీహెచ్.రమణరావు సత్కరించారు. కార్యక్రమంలో క్లబ్ ఉపాధ్యక్షురాలు సీహెచ్.లక్ష్మి, టి.లీలానాయుడు, కోశాధికారి పి.కమల, రాధ, కె.సుగుణ పాల్గొన్నారు.

విశ్వనాథంకు ఉత్తమ ఉపాధ్యాయుడు పురస్కారం

సీతంపేట : అక్కయ్యపాలెం ఎన్జీజీవోస్ కాలనీ జీవీఎంసీ హైస్కూల్ తెలుగు ఉపాధ్యాయుడు, ఎన్సీసీ అధికారి ఎం.ఎస్.వి.విశ్వనాథం జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాన్ని అందుకున్నారు. జిల్లా విద్యాశాఖ ఆధ్వర్యంలో గురువారం నగరంలోని ఒక ఫంక్షన్ హాలులో నిర్వహించిన జిల్లా స్థాయి గురుపూజోత్సవం కార్యక్రమంలో కలెక్టర్ ఎం.ఎన్.హరేందిర ప్రసాద్, జిల్లా విద్యాశాఖాధికారి చంద్రకళ చేతుల మీదుగా విశ్వనాథం దంపతులు పురస్కారం అందుకున్నారు. ఈ సందర్భంగా పాఠశాల హెచ్ఎం బి.లక్ష్మీనరస, సీతమ్మధార ఎంఈవోలు రామారావు, బాలామణి, ఏపీ ఉపాధ్యాయ సంఘం జిల్లా అధ్యక్షుడు అవనాపు అరుణ్‌కుమార్, జాతీయ ప్రధాన కార్యదర్శి ఎం.పి.శ్రీనివాస్, పాఠశాల ఉపాధ్యాయులు విశ్వనాథంను అభినందించారు.



గురుపూజోత్సవంలో హరగోపాల్ స్కూల్ విద్యార్థినుల విన్యాసాలు



మాట్లాడుతున్న లా కళాశాల ప్రిన్సిపాల్ రమణ

మద్రిపాలెం : సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతి సందర్భంగా జీవీఎంసీ 51వ వార్డు గాంధీనగర్ అంగన్‌వాడీ కేంద్రంలో ఉపాధ్యాయ దినోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. అంగన్‌వాడీ టీచర్ మౌలా బీబీ ఆధ్వర్యంలో రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆటల పోటీలు నిర్వహించి, కేక్ కట్ చేసి చిన్నారులకు పంపిణీ చేశారు. సంప్రదాయ దుస్తుల్లో చిన్నారులు ఆకట్టుకున్నారు.

సీతమ్మధార : స్థానిక టీపీటీ కాలనీలో గల న్యాయ విద్యా పరిషత్ (ఎన్‌వీపీ) లా కళాశాలలో గురుపూజోత్సవం గురువారం ఘనంగా నిర్వహించారు. ప్రిన్సిపాల్ డాక్టర్ డీవీ రమణ ఆధ్వర్యంలో దివంగత రాష్ట్రపతి సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉపాధ్యాయులంతా సర్వేపల్లిని ఆదర్శంగా తీసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ బి.గాయత్రి, అసిస్టెంట్ ప్రొఫెసర్ ఎం.ఎస్.సాగర్, దయాసాగర్, శ్రీలక్ష్మి, మధుమతి, వాకా శ్రీనివాస రెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

- స్థానిక టీపీటీ కాలనీలో గల నెహ్రూ మున్సిపల్ ఉన్నత పాఠశాలలో గురువారం జాతీయ ఉపాధ్యాయ దినోత్సవం ఘనంగా నిర్వహించారు. పాఠశాల ప్రధానోపాధ్యాయుడు రామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి నివాళులర్పించారు.

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీలో గల హరగోపాల్ స్కూల్‌లో సర్వేపల్లి రాధాకృష్ణన్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. నాటి ఉపాధ్యాయులకు, నేటి ఉపాధ్యాయులకు గల వ్యత్యాసాలను ప్రిన్సిపాల్ శంకరరావు వివరించారు. ఈ సందర్భంగా పలువురు సిబ్బందిని సత్కరించారు.

సీతంపేట : మురళీనగర్ వాకర్స్ క్లబ్ ఆధ్వర్యంలో క్లబ్ అధ్యక్షుడు పల్లా చంద్రమౌళి అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో కెమికల్ ఇంజినీరింగ్ కళాశాల పూర్వ ప్రిన్సిపాల్ డాక్టర్ బోకం దేముడు చేతుల మీదుగా 11 మంది ఉపాధ్యాయులను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కార్యదర్శి పి.చెల్వరాజు, వాకర్స్ 101 ఎలక్టెడ్ గవర్నర్ కె.ద్వారకానాథ్, కోశాధికారి కూర్మారావు పాల్గొన్నారు.

చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ



రికార్డులు పరిశీలిస్తున్న గొండు సీతారాం

మద్రిపాలెం : చిన్నారుల ఆరోగ్యంపై నిరంతర పర్యవేక్షణ అవసరమని రాష్ట్ర బాలల హక్కుల పరిరక్షణ కమిషన్ సభ్యుడు గొండు సీతారాం అన్నారు. ఈ మేరకు జీవీఎంసీ 53వ వార్డు ఆర్ అండ్ బీ జంక్షన్ సమీపంలోని శ్రీరాంనగర్ వద్ద ఉన్న శిశు గృహ కేంద్రాన్ని గురువారం ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా శిశుగృహలోని మౌలిక వసతులపై ఆరా తీసి, రికార్డులు పరిశీలించారు. సీజనల్ వ్యాధుల పట్ల జాగ్రత్తలు తీసుకోవాలని సిబ్బందికి సూచించారు. చిన్నారులకు పౌష్టికాహారం అందించాలన్నారు. ఐసీడీఎస్ సీడీపీవో రమణకుమారి, శిశుగృహ మేనేజర్ సుజాత, ఎంఎస్‌కే రాజన భవానీ పాల్గొన్నారు.

వృద్ధునిపై ఆవు దాడి



ఆవు దాడిలో గాయపడిన వృద్ధుడు

సీతమ్మధార : స్థానిక రైతుబజార్‌లో గురువారం ఒక ఆవు 60 ఏళ్ల వృద్ధుడుని పొడవడంతో తలపై గాయమైంది. తీవ్ర రక్తస్రావం కావడంతో తోటి వినియోగదారులు బెంబేలెత్తిపోయారు. వెంటనే స్పందించిన ఎస్టేట్ ఆఫీసర్ కొండబాబు, సహాయకుడు సతీష్ వృద్ధునికి సపర్యలు చేయించారు. రైతు బజార్‌లో నిత్యం పలు ఆవులు తిరుగుతున్నా సిబ్బంది, అధికారులు చర్యలు తీసుకోకపోవడంపై వినియోగదారులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు ఆవులు ఇష్టారాజ్యంగా బజారులో తిరుగుతూ అందినకాడికి కూరగాయలు, ఆకుకూరలు తినేస్తున్నాయని రైతులు, వ్యాపారులు ఆందోళన చెందుతున్నారు. నిత్యం రద్దీగా వుండే రైతుబజార్‌లో ఆవులు వస్తే తప్పించుకోవడానికి కూడా ఎంతో కష్టతరంగా వుంటుందని వాపోతున్నారు. ఇప్పటికైనా జిల్లా మార్కెటింగ్‌శాఖ అధికారులు స్పందించి సీతమ్మధార రైతుబజార్‌లో ఆవులు ప్రవేశించకుండా ప్రవేశమార్గంలో జాలీలు ఏర్పాటు చేయించాలని వినియోగదారులు, రైతులు కోరుతున్నారు.

ధ్యాన మందిరంలో ప్రత్యేక కార్యక్రమాలు

తాటిచెట్లపాలెం : రైల్వే న్యూ కాలనీ, రైల్వే ఎగ్జిబిషన్ గ్రౌండ్స్ ఎదురుగా గల షిర్డీ సాయిబాబా ధ్యాన మందిరంలో గురువారం ప్రత్యేక పూజలు, పలు కార్యక్రమాలు నిర్వహించారు. ముందుగా ఉదయం నుంచి బాబాకు అర్చనలు, అభిషేకాలు చేశారు. ఆలయ వ్యవస్థాపక అధ్యక్షుడు సూకల శేష గిరిరావు, త్రిపురాన రాంబాబు, కమిటీ సభ్యులు పర్యవేక్షించారు. అనంతరం స్వాతి ప్రమోటర్స్ సహకారంతో ధ్యాన మందిరం ఆవరణలో మట్టి ప్రతిమలు, వినాయక వ్రతకల్పం పుస్తకాలు భక్తులకు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లక్ష్మణ్‌రెడ్డి, సంతోష్‌కుమార్‌దేవ్ పాల్గొన్నారు.

ఉచితంగా కంటి పరీక్షలు

ఉదయం నుంచి మధ్యాహ్నం వరకు వాసన్ ఐ కేర్ హాస్పిటల్ సౌజన్యంతో ధ్యాన మందిరం ఆవరణలో ఉచితంగా కంటి పరీక్షలు నిర్వహించారు. సుమారు 80 మంది భక్తులు పరీక్షలు చేయించుకున్నారు. అనంతరం కంటి సంరక్షణ కోసం తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. శిబిరంలో వాసన్ ఐ కేర్ హాస్పిటల్ డాక్టర్ వసంత, చంటి, గోవింద పాల్గొన్నారు.



కంటి పరీక్షలు చేస్తున్న సిబ్బంది

విద్యుత్ సరఫరాకు నేడు అంతరాయం

సీతంపేట / సీతమ్మధార : దొండపర్తి సెక్షన్, రామాటాకీస్ 11 కేవీ ఫీడర్ పరిధిలో నిర్వహణ పనుల్లో భాగంగా శుక్రవారం పలు ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగుతుందని ఏపీఈపీడీసీఎల్ ఈఈ బి.సింహాచలం నాయుడు ఒక ప్రకటనలో తెలిపారు. రామాటాకీస్ మెయిన్ రోడ్, శ్రీనగర్ పార్కు, అశోక్‌నగర్, బుధిల్‌పార్కు రోడ్, డే అండ్ నైట్ ఆస్పత్రి రోడ్ ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 9 గంటల నుంచి మధ్యాహ్నం 2 వరకు విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని, వినియోగదారులు సహకరించాలని కోరారు.

- ఆశీలుమెట్ట సెక్షన్ ఆఫీస్ పరిధిలో గల సత్యం జంక్షన్ 11 కేవీ ఫీడర్ మరమ్మతుల కారణంగా పలు ప్రాంతాల్లో శుక్రవారం ఉదయం 8 గంటల నుంచి మధ్యాహ్నం ఒంటి గంట వరకు విద్యుత్ సరఫరా వుండదని ఈపీడీసీఎల్ జోన్ – 1 ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ బి.సింహాచలం నాయుడు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. తులసిపేట, వినాయక నగర్, రేసపువానిపాలెంలోని అంబేడ్కర్ భవన్, బుల్లయ్య కళాశాల, స్పెన్సర్ ఏరియా, బీఎస్ఎన్ఎల్ కార్యాలయం, విశాఖ జిల్లా వైద్య ఆరోగ్య శాఖ ఆఫీసు పరిసర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిచిపోతుందని తెలిపారు.

మాతృ మరణాలు నియంత్రించాలి



సమావేశంలో మాట్లాడుతున్న డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వరరావు

మహారాణిపేట: మాతృ మరణాలు సంభవించకుండా చర్యలు తీసుకోవాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖాధికారి (డీఎంహెచ్‌వో) డాక్టర్ పి.జగదీశ్వరరావు హెచ్చరించారు. గురువారం సాయంత్రం రేసపువానిపాలెంలో ఉన్న కార్యాలయంలో మాతృ మరణాలపై సమీక్ష నిర్వహించారు. ఆగస్టులో రైల్వే న్యూకాలనీ పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో ఒకటి, స్వతంత్ర నగర్-1 పట్టణ ఆరోగ్య కేంద్రం పరిధిలో మరొకటి జరిగాయన్నారు. వీటికి సంబంధించి వివరణ ఇవ్వాలని డీఎంహెచ్ కోరారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ ఆఫీసర్ (డీఐవో) డాక్టర్ ఎస్.జీవన్‌రాణి, అగనంపూడి ఏరియా ఆస్పత్రి ఆర్ఎంవో డాక్టర్ పి.ఉష, గైనకాలజిస్టులు డాక్టర్ ఎస్.షర్మిల కుమారి, డాక్టర్ ఆర్.డి.ఎస్.శ్వేత, కేజీహెచ్ ఎనస్తీషియా డాక్టర్ టి.వి.శ్రీకృష్ణ, జనరల్ మెడిసిన్ డాక్టర్ బి.వర్ధిక, నోడల్ అధికారి డాక్టర్ బి.ఉమావతి, జిల్లా మీడియా విస్తరణ అధికారి (డెమో) బి.నాగేశ్వరరావు, ఐసీడీఎస్ అధికారులు జి.శారదాదేవి, ఎం.శ్రీకళ, ఐ.మనోరమ, 108 జిల్లా మేనేజర్ వి.త్రినాథరావు, మెడికల్ ఆఫీసర్లు, వైద్యాధికారులు, ప్రైవేట్ ఆస్పత్రుల వైద్యులు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

రంగిరీజువీధి యూపీహెచ్‌సీ సందర్శన

మహారాణిపేట: డీఎంహెచ్‌వో డాక్టర్ పి.జగదీశ్వరరావు గురువారం రంగిరీజువీధి పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని సందర్శించారు. ఇక్కడ జరుగుతున్న అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలను తనిఖీ చేసి సిబ్బందికి పలు సూచనలు చేశారు. అనంతరం కేజీహెచ్‌లో గల ప్రభుత్వ నర్సింగ్ కళాశాల, హాస్టల్‌ను సందర్శించి డెంగ్యూ కేసులు నమోదవుతున్నాయని, దోమల మందు స్ప్రే చేయించాలని జిల్లా మలేరియా అధికారికి సూచించారు. ప్రిన్సిపాల్‌తో చర్చించి హాస్టల్లో అన్ని గదులకు దోమ తెరలు ఏర్పాటు చేయాలని డీఎంహెచ్‌వో తెలిపారు. ఈ పర్యటనలో యూపీహెచ్‌సీ వైద్యులు, ఆరోగ్య సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

8న 'హెచ్‌పీవీ' వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం



డాక్టర్ షిరీన్ రెహమాన్

మహారాణిపేట: జీవీఎంసీ 37వ వార్డు సచివాలయం(ఏవీఎన్ కళాశాల ఎదురుగా)లో ఈ నెల 8న హెచ్‌పీవీ(హ్యూమన్ పాపిల్లోమా వైరస్) వ్యాక్సిన్ బూస్టర్ శిబిరం నిర్వహించనున్నట్లు చైతన్య స్రవంతి స్వచ్ఛంద సేవా సంస్థ అధ్యక్షురాలు డాక్టర్ షిరీన్ రెహమాన్ తెలిపారు. ఈ ఏడాది ఫిబ్రవరి 16న 9 నుంచి 14 ఏళ్ల లోపు బాలలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ మొదటి డోస్ ఇచ్చినట్లు తెలిపారు. ఆరు నెలల నుంచి ఒక సంవత్సరం లోపు బూస్టర్ డోస్ వేయాల్సి ఉందన్నారు. దక్షిణ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్, కేజీహెచ్ రేడియేషన్ అంకాలజీ విభాగాధిపతి డాక్టర్ పాండురంగ కుమారి ఈ కార్యక్రమాన్ని ప్రారంభిస్తారని.. ఫిబ్రవరిలో వ్యాక్సిన్ మొదటి డోస్ వేసుకున్న బాలలందరూ బూస్టర్ డోస్ వేసుకోవాలని సూచించారు. బాల్యంలో ఈ డోస్ వేయడం వల్ల పెద్దయ్యాక క్యాన్సర్ వచ్చే అవకాశాలు తగ్గుతాయని, తల్లిదండ్రులు తమ పిల్లలకు హెచ్‌పీవీ వ్యాక్సిన్ వేయించాలని డాక్టర్ షిరీన్ విజ్ఞప్తి చేశారు.

పౌర హక్కులపై అవగాహన అవసరం

మద్రిపాలెం : పౌర హక్కులపై వినియోగదారులు కనీస అవగాహన కలిగి ఉండాలని కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి సూచించారు. ఈ మేరకు జీవీఎంసీ 51వ వార్డు మాధవధార ఉడా కాలనీ వద్ద ఉన్న శ్రీపాద డిగ్రీ కాలేజీలో గురువారం లీగల్ మెట్రాలజీ సౌజన్యంతో వినియోగదారుల హక్కులపై నిర్వహించిన అవగాహన సదస్సులో ఆయన మాట్లాడారు. ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ ప్రశ్నించే హక్కు కలిగి ఉన్నారని గుర్తు చేశారు. ఆహార కల్తీ, తూనికలపై అవగాహన పెంచుకోవాలని విద్యార్థులకు సూచించారు. కార్యక్రమాన్ని కళాశాల ప్రిన్సిపాల్ డి.రాజేష్ పర్యవేక్షించారు. కార్యక్రమంలో సీఆర్‌సీ ఇండియా ఇక్బాల్ జాఫర్, డిప్యూటీ కంట్రోలర్ లీగల్ మెట్రాలజీ డిపార్ట్‌మెంట్ రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.



సదస్సులో మాట్లాడుతున్న కంచరపాలెం ట్రాఫిక్ సీఐ దాశరథి

ఆస్తి, చెత్త పన్ను రద్దు చేయాలి



మేయర్‌కు వినతి పత్రం అందిస్తున్న వైఎస్సార్‌సీపీ ఫ్లోర్‌లీడర్ బానాల

సాక్షి, విశాఖపట్నం: జీవీఎంసీ పరిధిలో విలువ ఆధారిత ఆస్తి పన్ను, చెత్తపై యూజర్ చార్జీల రద్దుతో పాటు ఆస్తి పన్ను తగ్గింపు అంశాలను కౌన్సిల్ సమావేశంలోని అజెండాలో పొందుపరచాలని వైఎస్సార్ సీపీ ఫ్లోర్ లీడర్ బానాల శ్రీనివాసరావు కోరారు. మేయర్ గొలగాని హరివెంకటకుమారిని ఆమె చాంబర్‌లో గురువారం కలిసిన ఆయన అజెండాలో చేర్చాల్సిన అంశాలపై వినతిపత్రం అందించారు. ప్రస్తుతం అమల్లో ఉన్న విలువ ఆధారిత ఆస్తి పన్ను రద్దు చేస్తూ.. గతంలో మాదిరిగా అద్దె ప్రాతిపదికన పన్ను విధిస్తూ తీర్మానం చేసి రాష్ట్ర ప్రభుత్వానికి ఆమోదం కోసం పంపించాలని కోరారు. కూటమిలో ఉన్న టీడీపీ. జనసేన, బీజేపీ నేతలు.. ఆస్తిపన్నుతో పాటు చెత్తపై యూజర్ చార్జీలు పూర్తిగా రద్దు చేస్తామని ఎన్నికల ముందు హామీలిచ్చిన విషయాన్ని బానాల గుర్తు చేశారు. దానికి కట్టుబడి 10న జరిగే కౌన్సిల్‌లో ఈ ప్రతిపాదనలను బలపరుస్తారని ఆశిస్తున్నట్లు శ్రీనివాసరావు తెలిపారు.

బ్యాంక్ ఖాతాల సరఫరాదారుడు అరెస్ట్



అరెస్ట్ అయిన గోస్వామి

విశాఖ సిటీ: సైబర్ నేరగాళ్లకు బ్యాంకు ఖాతా సరఫరా చేసిన వ్యక్తిని సైబర్ క్రైం పోలీసులు అరెస్టు చేశారు. వివరాలివీ.. నగరానికి చెందిన ఓ మహిళకు గుర్తు తెలియని నంబర్ నుంచి ఫోన్ వచ్చింది. మీరు సంజయ్ సింగ్ అని, మనీ ల్యాండరింగ్ కేసులో ఉన్నారని, మీ మీద రిపోర్ట్ జనరేట్ అయిందని భయపెట్టాడు. బ్యాంక్ స్టేట్‌మెంట్లతో న్యూఢిల్లీ రావాలని ఫోన్‌లో చెప్పాడు. దీంతో ఆ మహిళ తనకు సంజయ్‌సింగ్ ఎవరో తెలియదని చెప్పినప్పటికీ.. ఫోన్‌లో వ్యక్తి పదేపదే మనీల్యాండింగ్ కేసుల్లో ఉన్నారని, వెంటనే రూ.37 లక్షలు ట్రాన్స్‌ఫర్ చేయకపోతే అరెస్టు చేస్తామని బెదిరించాడు. దీంతో మహిళ భయపడి ఫోన్‌లో వ్యక్తి చెప్పిన బ్యాంక్ అకౌంట్‌కు రూ.37 లక్షలు పంపించింది. వెంటనే ఫోన్ కట్ అయింది. తర్వాత మోస పోయనని గ్రహించిన మహిళ సైబర్ క్రైం పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసి దర్యాప్తు చేసిన సైబర్ క్రైం పోలీసులు.. సాంకేతిక సహాయంతో హైదరాబాద్‌కు చెందిన బ్యాంక్ ఖాతాల సరఫరాదారుడైన రాహుల్‌గిరి గోస్వామిని అదుపులో తీసుకున్నారు. అనంతరం విశాఖ తీసుకొచ్చి రిమాండ్‌కు పంపించారు. అతని బ్యాంక్ ఖాతాలో సుమారు రూ.6 కోట్ల వరకు లావాదేవీలు జరిగినట్లు గుర్తించారు.

మత్స్య పరిశ్రమ ఆర్థిక పరిపుష్టికి సమగ్ర ప్రణాళిక



మాట్లాడుతున్న మైలపల్లి లక్ష్మణరావు

మహారాణిపేట: మత్స్య పరిశ్రమ ఆర్థిక పరిపుష్టికి సమగ్ర ప్రణాళిక రూపొందిస్తామని ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ బోట్ ఆపరేటర్స్ అసోసియేషన్ నూతన అధ్యక్షుడు మైలపల్లి లక్ష్మణరావు తెలిపారు. గురువారం ఫిషింగ్ హార్బర్‌లోని అసోసియేషన్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన కార్యక్రమంలో కొత్త అధ్యక్షుడిగా ఆయన బాధ్యతలు చేపట్టారు. ప్రభుత్వాల సహకారంతో మత్స్య పరిశ్రమకు జవసత్వాలు కల్పిస్తామని, ప్రతి ఆపరేటర్, మత్స్యకారుని సంక్షేమానికి గట్టి కృషి చేస్తామన్నారు. రాష్ట్ర మరపడవల సంఘం మాజీ అధ్యక్షుడు పీసీ అప్పారావు, రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ కోలా గురువులు , రాష్ట్ర ఫిషరీస్ కార్పొరేషన్ మాజీ చైర్మన్ పేర్ల విజయచందర్, మర పడవల సంఘం నూతన ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా అసోసియేషన్ నూతన కార్యవర్గాన్ని ఏర్పాటు చేశారు.

పెండింగ్ జీతాలు చెల్లించాలని ఆందోళన

మహారాణిపేట: పెండింగ్‌లో ఉన్న నాలుగు నెలల జీతాలు ఇవ్వాలని కోరుతూ సెక్యూరిటీ గార్డులు ఆందోళన చేపట్టారు. ప్రభుత్వ హాస్పిటల్స్ కాంట్రాక్ట్- అవుట్ సోర్సింగ్ వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో గురువారం ప్రభుత్వ విక్టోరియా ఆస్పత్రి ఎదుట నిరసన ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా యూనియన్ గౌరవ అధ్యక్షుడు పి.వెంకట్రావు మాట్లాడుతూ నాలుగు నెలలుగా జీతాలు ఇవ్వకపోవడం వల్ల ఆర్థిక ఇబ్బందులు పడుతున్నామన్నారు. తక్షణం జీతాలు చెల్లించాలని కోరారు. జీతాలు ఇవ్వకపోతే విధులు బహిష్కరిస్తామని హెచ్చరించారు.

అనంతరం సూపరింటెండెంట్ డాక్టర్ పి.ఉషకు వినతిపత్రం సమర్పించారు. ఈ నేపథ్యంలో కాంట్రాక్టర్‌ను పిలిచి తక్షణం జీతాలు ఇవ్వాలని సూపరింటెండెంట్ తెలపగా రెండు నెలల పెండింగ్ జీతాలు చెల్లించడంతో గార్డులు ఆందోళన విరమించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు ఎ.శంకర్, బి.ధనలక్ష్మి, ఎం.భవానీ తదితర 20 మంది పాల్గొన్నారు.